# గాలివాన

## (పాట కథ)

**గా**లివాన వచ్చి పంటల్ని గట్టులమీద కెక్కిస్తే ఇళ్ళు కూలిపోయి, ఒళ్ళు తలక్రిందులై, ఏళ్ళూ ఊళ్ళూ ఏకమైపోయి, సెలయేళ్ళు మహానదులై, కొండవాగులు గోదావరీ నదులై మేఘాలే భూమికి దిగివచ్చి, ప్రపంచంలోని సముద్రాలన్నీ ఎత్తివచ్చీ, శివాలెత్తి, పరవళ్ళెత్తి, అవన్నీ అంబరము హత్తుకుపోయి ప్రళయరుద్రుడు తాండవంచేస్తే, కాలరుద్రుడు గంతులువేస్తే, విలయరుద్రుడు వీరాంగం ఆడితే విరుచుకుపడింది – తుఫాను విశాఖపట్టణం జిల్లా పైనా, తందానా!

ఈ మహాప్రళయం మధ్యనే కారుపల్లె గ్రామం. గ్రామం మధ్యన భైరి అప్పలస్వామి యిల్లు, అప్పలస్వామి ఆరితేరిన రైతు. అన్నమాట నిలబెట్టుకొనే దిట్టరి. అసలయిన కాపు. సిసలైన గుణాలవాడు తందానా!

గడపదాటి పైకి కాలుపెట్టిన అప్పలస్వామి కళ్లకి ప్రత్యక్షం అయ్యాయి – పడిపోయిన పంటలు, పాడైపోయిన చేలూ, కూలిపోయిన గోడలు, కొట్టుకుపోయిన ఊళ్ళు, గోలపెడ్తున్న ప్రజలు, తందానా తాన తందానా!

ఇళ్ళులేవు, వాకిళ్ళు లేవు, గృహాలు పడిపోతే దేహాలు వదిలేసినవాళ్ళు, వరదల్లో కొట్టుకుపోయినవారు. ఇది వరదాకా ఉన్న సగం కాటకంతో ఎండిపోయారు జనులు. ఈ ప్రళయం దివాలాతీసిన వాళ్ళ ఇంట్లో దొంగలు పడ్డట్టే అయింది తందానా తానా, తానా తందానా తానా!

అన్నీ చూసిన అప్పలస్వామి తన పెద్దగాదెలు తలుపులు లాగి పారేశాడు. గుండిగల్లో వంటలు పెట్టించాడు. అండిగల్లో కూరలు వండించాడు. పాత్రల్లో పప్పులూ, బానల్లో పులుసులూ వండించాడు. బీదా మాత్రమే కాదు, సాదా మాత్రమే కాదు, అందరికీ, ఆ బాలగోపాలానికి కొద్దివారికీ గొప్పవారికీ  ముసలివారికీ ముతకలకీ, బిడ్డలకీ, పెద్దలకీ, ఆడవారికి అష్టాదశ వర్ణాలికీ అన్నమోరామచంద్ర అని వచ్చినవారందరికీ, సిగ్గుబడినా, మొహమాటం పడినా అందరికీ అన్ని విధాలా కనుక్కుని కాశికాన్నదాతలా పెట్టాడండీ తానా, తానా, తందానా తందానా తానా!

## 2

**కా**మమ్మ అప్పలస్వామి కూతురు అందాలబరిణ, అనురాగాలపోగు. పెద్దరయితు అవడంచేత ఊళ్ళో పంతుల్ని పెట్టి చెప్పించాడు చదువు. విజయనగరం పంపించాడు

పెద్ద చదువుకు. తన చారడేసి కళ్ళతో చూసిన పుస్తకం తప్పకుండా హృదయగతం, గులాబిపువ్వుపుటలల్లా ఉన్న చెవులతో విన్న పాఠం బుద్ధిగతం, నవ్వితే నవరత్నాలు ఒలుకుతవి: తన కుసుమాలు వర్షాలు కురుస్తవి. తన తీయని కంఠంతో పాటపాడిందా గోవులు కదలవు, ఆవుదూడలు మెదలవు. నాగులు ఆడతాయి. నాగులు నృత్యంచేస్తవి. పక్షులు నిలిచి బొమ్మలవుతవి. ఆకాశంలో మబ్బులే ఆలకిస్తాయా! తందానా! జయామ్మా!

ఆ అందాల బొమ్మ తుఫాను సంగతి వినగానే కాలేజీనుంచి, అన్నపూర్ణలా వచ్చిపడింది. చిన్నతనంలో కామమ్మా నేడు కామేశ్వరి, స్నేహితురాండ్రకు కాముడు, చుట్టాలకు కామం! తందాన తానా!

ఆ ఖండం అంతా కాటకంతో మండిపోతుంది. బియ్యం దొరకటంలేదు. జొన్నలు, చోళ్ళూ, సజ్జలు, గంటెలు ప్రపంచంలోనే లేవో, అవి ఉద్భవించనేలేదో, అవి కథలలో మాత్రమే కనబడుతాయో తందానా! తందానా!

ఎంతమంది తల్లులు తమ తీపుల అద్దాల బిడ్డలకు ఆకలి తీర్చడానికి పాలులేవని తల్లడిల్లి పోతున్నారో, కుళ్ళిపోతున్నారో, తందానా తానా, తందా...నా!

గ్రామ నాయకులు, జిల్లా నాయకులు, దేశ నాయకులు ఎంత గగ్గోలు పడినా, కంఠాలు బద్దలు కొట్టుకొని ఉపన్యాసాలిచ్చినా ధనం ఊడిపడదు, దాక్షిణ్యం తొణికిసలాడదు ధర్మం ప్రత్యక్షంకాదు, వితరణం అవతరించదండో! తానా తానా: తందానా! తానా తందానా తానా!

అప్పలస్వామిగాదె ఖాళీ అయింది. పాతర్లు బయటపడినాయి. అప్పలస్వామి స్నేహితులు అరుదైపోయారు; చుట్టాలు చూపులేదు! పక్కాలు పత్తాదొరకరు: మొహమాటస్తులు మొహాలు చాటి వేసుకొన్నారండి బాబూ, బాబూ, బాబూ, బంగారుబాబు వినరండో!

ఇంట్లో నగలన్నీ అమ్మాడు: వెండి సామానులమ్మాడు: భూములు తనఖాపెట్టి, ఈనాములు కుదువపెట్టి, విజయనగరం షాహుకార్లను పట్టుకొని జయజయ అంటూ దొరికిన జొన్నలు, చోళ్ళు, గంటెలు, సజ్జలు, వరిగెలు పట్టుకు వచ్చాడా అభినవ కర్ణుడు, శిబి, దధీచి, అయిన అప్పలస్వామిగారా ఏమి చూశారా తందానా తానా!

## 3

**కా**మేశ్వరి విజయనగరం ఉత్తరాలు రాసి తనతో చదివిన స్నేహితురాళ్ళందరినీ ఒక సంఘంగా కూడమంది. సభ్యురాండ్రను చేర్చమంది. సభలు చేయమంది, చందాలు వసూలు చేయమందీ తండ్రీ తందాన తందాన!

జనాభా ఎక్కువ, ధనాలా తక్కువ; తినడానికి కడుపుల సంఖ్య ఎక్కువ. తేవడానికి గింజలు తక్కువ: చచ్చినవాళ్ళు చచ్చారు. భగవంతునికి ఇష్టంలేక చంపగలవారెవరు? చావగలిగినవారెవరు అని అమ్మలక్కలందరూ వేదాంతాలాడారు. ఓ యమ్మలారా తందానా తందానా!

తన ఒంటినున్న నగలు రెండువేల రూపాయలు వచ్చినవి: అవన్నీ తండ్రికి ఇచ్చింది కామేశ్వరీదేవి తందానా తందానా!

"ఓ అయ్యా, ఇవి అమ్మి ప్రజలకు పెట్టూ, తిండిలేక మాడుతున్నారు, బీదరైతులకు విత్తనాలకు గింజలులేవు, కూలికి సత్తువలేదు.

*"ఏ దేశమో పోయి*
*ఏదైనా తినబోతే*
*నడచి పోలేరయ్య*
*గడచి పోలేరు*
*"ఆకారమే లేని*
*ఆ చిన్ని కందులకు*
*పా లెక్కడున్నాయి*
*బట్టెక్కడున్నాది*
*కళ్ళు దించుకుపోవు*
*తల్లులట వారంత*
*తల్లి పిల్లలపాలి*
*"దైవ మేడున్నాడు?"*

"అయ్యా, నన్ను విజయనగరంపోనీ, ఏమవుతుందో", అన్నదండి ఆ అమ్మాయీ కామేశ్వరీ దేవి తందానా!

## 4

**టి**క్కట్టులేకుండా ఆడవాళ్ళ పెట్టెలో రైలెక్కింది. టిక్కెట్టు తనిఖీదారు టిక్కెట్టడిగాడు.

"లేదండి బాబూ!"

"నీ వేషం బాగుంది. చదువుకుంటున్నావా?"

"అవునండీ."

"ఏంచదవు?"

"బి.యస్.సి."

"వారేవా నీ! నీ పేరు?"

"కామేశ్వరి."

"అల్లో కామేశ్వరీ! మరి దబ్బియ్యి టిక్కటిస్తా!"

"అయ్యా! మా ఊరిలో కాటకదేవత కాలుపెట్టడంచేత, కడుపుకులేక ప్రజలు మాడడంచేత విజయనగరంపోయి పెద్దలకూ, పిన్నలకూ, ఉద్యోగులకూ, ఊళ్ళేలువారికి, ధనవంతులకూ, ఘనవంతులకూ మనవిచేసి ధనమో, ధాన్యమో, వసూలు చేద్దామని బయలుదేరానండీ" అన్నది కామేశ్వరీదేవి తందానా!

"టట్, డామిట్, అది కాదమ్మాయి, అందాలపడుచా! నీ మాట ఎవరు వింటారు? రా! నేను పెద్దల నెందరినో ఎరిగున్నవాణ్ణి, నీకు సహాయం చేయిస్తానన్నాడండీ, టిక్కట్టు కలకటేరూ తందానా!

"రాజ్యం దివాను నాకెరుక, మహారాజా నాకెరుక, కలక్టరు నాకెరుక, ఖామందు నాకెరుక, షాహుకార్లు నాకెరుక, సంపన్నులు నాకెరుక, నాతో రా, దివానుగారి దగ్గరకు తీసుకెడతా" నన్నాడండీ టికెట్టు కలకటేరు తందానా తానా!

రైలు ఆలస్యమై ఆ రోజు సాయంకాలం ఏడుగంటలకు విజయనగరం చేరుకుంది. టిక్కట్టు కలక్టరు కామేశ్వరిని వెంటబెట్టుకొని, ఒక గుఱ్ఱంబండి చేయించాడు. వాడిచేతిలో రూపాయిపెట్టాడు. అయిదు రూపాయలనోటు పెట్టాడు. అమ్మాయిని ఎక్కమన్నాడు. తా నెక్కాడండి టిక్కట్టు కలకటేరూ తందానా!

గుఱ్ఱం మంచి జాతిది. బండివాడు గడుసు రకంవాడు. ఛెల్ ఛెల్. పరుగెత్తింది, పట్నం బైటే, రస్తాదారిలో కోటవైపుకే పరుగెత్తిందీ: జాతి గుఱ్ఱమండీ తందానా!

కోట దాటిందీ, తోట దాటిందీ, పొలాలుదాటి విశాఖపట్నం రోడ్డు పట్టింది. గుఱ్ఱంబండి వేగంగా వెళుతోంది. దౌడు తీస్తోంది గుఱ్ఱం, జాతి గుఱ్ఱమండీ తందానా తానా తందానా!

బూతులు తిట్టూ గుఱ్ఱాన్ని తరుముతున్నాడు బండివాడు. ఉప్పొంగిపోతున్నాడు టిక్కట్టు కలక్టరు. బలే టిక్కట్టు కలకటేరు తందాన తానా!

ఓహో! ఆ కామమ్మకు భయమేసింది. గుండెల్లో దుడుకు పుట్టింది. ఓ కాశీ అన్నపూర్ణా, కంచికామాక్షీ, నన్ను రక్షించుతల్లీ! అని లోన దండాలు పెట్టుకుంది. కామేశ్వరమ్మాయి తందానా తందానాతానా, తాన తందాన!

"సార్ ఇంకా దివానుగారి ఇల్లు ఎంతదూరం?"

"ఇదిగో వచ్చాం, ఆపు బండీ!"

బండి ఆగింది: బండిదిగాడా టిక్కట్ల ఇనస్పెక్టరు. ఆ అమ్మాయి దిగింది బండి. బండివాడు వెంటనే బండితిప్పి గబగబ వెనక్కు తిప్పి విజయనగరం దారి పట్టాడు. అది విజయనగరం దగ్గిరదైనా కాని నిర్జన స్థలం. అమ్మయ్యో భయమేసింది బంగారు తల్లికి తందానా!

"ఇది ఏమిటండి బాబూ!"

"ఇది తోట. ఆ ప్రక్కనే మేడ; పద, నా చేయి పట్టుకో!"

కాని అమ్మాయి చేయి పట్టుకోలేదు. అతగాడే ఆమె చేయి గబుక్కున పట్టుకోని, ఒక చిటికెలో గద్ద కోడిపిల్లను తన్నుకు పోయినట్లు పొలంలోకి లాక్కుపోయాడు. ఆ అమ్మాయి భయంచేత "ఓ" యని మూర్ఛపోయింది. మా తల్లి కామేశ్వరీ తందానా!

మా బాగుందనుకొని ఆ రాక్షసుడు, రక్తంచరుడు, పిశాచి పొలంలోకి, సొమ్ము మూట ఎత్తుకు పోయే దొంగలా తీసుకుపోయాడు. వాడి బ్రతుకే నీచమైపోనూ తందానా!

ఆ మూర్ఛలాంటి కళ్ళల్లో, ఆమె ఎదుట చిక్కిపోయినవాళ్ళు, పాలులేని పిల్లలు, పంటలులేని రైతులు చేతులుచాచి కనబడ్డారు, మా తల్లి కామేశ్వరీదేవి కోయమ్మా తందానా!

ఒక్కసారిగా ఆ అమ్మాయికి మెలకువ వచ్చింది. ఓ శక్తి అయ్యిందండి. ఏలా విదిలించుకొందో వాడి కౌగిలింత, కిందికి ఉరికింది. వాణ్ణి సాగదీసి లెంపకాయకొట్టి, ఆ పొలాలలో, గోతుల్లో, లేడిలా పరుగెత్తింది. వెనక వాడు, ముందు ఆమె దడదాడ దడదాడ తందానా తందానా తాన తాన తాన తందానా!

ఆమెను ఆ రాక్షసుడు అందుకోలేకపోయాడు. ఒక రాయి తగిలి పడ్డాడు. ఆమె రోడ్డుమీదికి ఉరికిందండీ తందానా!

ఇంతలో కారులైట్లు, కారు ఆగి ఒక పెద్దమనిషి దిగి "ఎవరమ్మా మీ" రన్నాడు. దేవుడై అతడూ తందానా!

"అయ్యా రక్షించండి: ఆ రాక్షసుడు రైలు.... టిక్కట్లు - దివాను - ఇల్లు - ఇక్కడికి అన్నాడు" అంది వగరుస్తూ మా తల్లి కామేశ్వరీ తందానా!

"అమ్మా నీ పేరు?"

"కా... కా.... కామేశ్వరండీ"

"తల్లీ నువ్వా!! నేనే దివానును. నీ ఉత్తరం అందింది. పక్క ఊళ్ళో పనివుండి, నువ్వు వస్తావని తొందరగా వస్తున్నా రైతుబిడ్డా, రా తల్లీ ఈ కారు ఎక్కమ్మా చందాలు పదివేలు వసూలు చేసెదము. జమీవారు పదివేలమ్మా" అన్నాడండి. ఆ అమ్మాయి తియ్యటి మూర్ఛపోయిందండీ తందానా తందానా! జై జై జై జై, తందాన తాన!

కథ కంచికి, మనం హైదరాబాదండీ తాన తాన తందనాన తానా!